క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు గొలగమూడి విద్యార్థినులు



బి.శ్రావణి



సాహిత్య

వెంకటాచలం : అనకాపల్లి జిల్లా తుమ్మపాళ్లలో నవంబరు 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) అండర్–17 ఖోఖో పోటీలకు గొలగమూడిలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని బి.శ్రావణి ఎంపికైంది. అలాగే నవంబర్ 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–14 ఖోఖో పోటీలకు ఆరో తరగతి విద్యార్థిని సాహిత్య ఎంపికైంది. ఈ సందర్భంగా వీరిని హెచ్‌ఎం లక్ష్మీకామేశ్వరి దేవి, పీడీ షేక్.షబిక అభినందించారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : లారీని మోటార్ బైక్ ఢీకొని వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని చెముడుగుంట సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం జరిగింది. గూడూరు పట్టణానికి చెందిన ప్రవీణ్ పనినిమిత్తం బైక్‌పై నెల్లూరుకు వెళ్లారు. తిరిగి గూడూరుకు వెళ్తుండగా చెముడుగుంట సమీపంలో హైవేపై ముందు వెళ్తున్న లారీని బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రవీణ్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న సీఈఓ జగదీష్ పటేల్

ముత్తుకూరు : జిల్లాస్థాయి క్రీడలకు ఎంపికైన కృష్ణపట్నం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులను అదాని కృష్ణపట్నం పోర్టు సీఈఓ జగదీష్ పటేల్ బుధవారం అభినందించారు. జిల్లా స్థాయి క్రికెట్, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అదాని ఫౌండేషన్ ద్వారా క్రీడల్లో రాణించేందుకు అవసరమైన శిక్షణ ఇస్తామన్నారు. ఫౌండేషన్ హెడ్ రాజేష్‌రంజన్, డాక్టర్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

జాతీయ ఐక్యతకు కళా వందనం



పేపర్ కార్వింగ్‌తో వల్లభ్‌భాయి చిత్రం

ముత్తుకూరు : ముత్తుకూరు మండలం, నారికేళపల్లి పంచాయతీలోని సుబ్బారెడ్డిపాళెం యూపీ స్కూల్ తెలుగు పండిట్ సోమా పద్మారత్నం బుధవారం పేపర్ కార్వింగ్ విధానం ద్వారా ఉక్కుమనిషి సర్దార్ వల్లభ్‌భాయి పటేల్ చిత్రాన్ని రూపొందించారు. ఈనెల 31 తేదీన జాతీయ ఐక్యత దినోత్సవం, పటేల్ జయంతి సందర్భంగా చిత్రాన్ని ఆవిష్కరించారు.

అనుమతుల్లేకుండా విక్రయిస్తే చర్యలు

• ఎస్సై శివరాకేష్



మనుబోలు : దీపావళి సందర్భంగా అనుమతి లేకండా బాణసంచా విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై శివరాకేష్ హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. బాణసంచా దుకాణాల వద్ద తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దుకాణాల వద్ద నీరు, పొడి ఇసుకను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. మనుబోలులో బాణసంచా దుకాణాల నిర్వహణకు నలుగురికి, బద్దెవోలులో ఒకరికి మాత్రమే అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. ఇతర గ్రామాల్లో విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. బాణసంచా కాల్చే సమయంలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే 100, 101, 112కు కాల్ చేయాలని సూచించారు.

మనల్ని ఎవడ్రా ఆపేది..?



కోడూరు సమీపంలో అనధికారికంగా సాగులో ఉన్న రొయ్యల చెరువు



రొయ్యల చెరువు ఉప్పు నీటితో వరిగొండ ప్రాంతంలో దెబ్బతిన్న వరిపంట(ఫైల్)

- అనధికార ఆక్వాకు చెక్ పడేదెన్నడో
- నెల్లూరు డివిజన్‌లో 40 శాతానికి పైగా అనధికార సాగు
- ప్రభుత్వ ఆదాయానికి రూ.కోట్లలో గండి

తోటపల్లిగూడూరు : తక్కువ సమయంలో ఆర్థికంగా ఎదిగేందుకు ఎంచుకునే రంగాల్లో ఆక్వా రంగం ప్రధానమైనది. రూ.కోట్లలో వ్యాపారం జరిగే ఆక్వా రంగంలో అనుమతులు లేని సాగు ద్వారా ప్రభుత్వానికి గణనీయంగా రాబడి తగ్గిపోతోంది. నెల్లూరు డివిజన్‌లోని తోటపల్లిగూడూరు, ముత్తుకూరు, నెల్లూరు రూరల్ మండలాల్లో 6,600 ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. ఇందులో 1,550 ఎకరాల్లో మంచి నీటి చెరువులు, మరో 5,050 ఎకరాల ఉప్పునీటి చెరువుల్లో రొయ్యల పెంపకం జరుగుతోంది. అయితే ఇందులో 60 శాతం వరకే మత్స్యశాఖ అధికారుల అనుమతితో రైతులు ఆక్వాసాగు చేస్తున్నారు.

యథేచ్ఛగా అనధికారిక ఆక్వా

సాధారణంగా ఆక్వా సాగు చేపట్టాలంటే ముందుగా రైతులు సంబంధిత భూమి వరిసాగుకు పనికి రాదంటూ రెవెన్యూ అధికారుల వద్ద ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. ఆపై విద్యుత్ కనెక్షన్ కోసం ట్రాన్స్‌కో అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. చివరగా నిబంధనల మేరకు చలానా కట్టి మత్స్యశాఖ అధికారుల అనుమతి పొందాలి. ఆ తర్వాతనే రైతులు ఆక్వా సాగు చేపట్టాలి. అయితే ఇదంతా సమయం, ఖర్చుతో కూడిన పని కావడంతో రైతులు నిబంధనలకు తుంగలో తొక్కి అనధికారికంగా ఆక్వా సాగును చేపడుతున్నారు. నెల్లూరు మత్స్యకార డివిజన్‌లో సాగులో ఉన్న 6,600 ఎకరాల్లో 60 శాతం వరకే మత్స్యశాఖ అధికారుల అనుమతితో రైతులు ఆక్వాసాగు చేస్తున్నారు. మిగిలిన 40 శాతం రైతులు అనధికారికంగా ఆక్వా సాగు చేస్తున్నారు. దీనివల్ల రూ.కోట్లాది ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

వరి రైతులకు ఉరే

అనధికార ఆక్వా మూలంగా వరి రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తోంది. రొయ్యల గుంతలకు అనుమతి కోసం వెళ్లినప్పుడు పక్కనున్న పంట పొలాలకు ఇబ్బందులు లేకుండా ఉండే పరిస్థితి ఉంటేనే మత్స్యశాఖ అధికారులు అనుమతిస్తారు. అయితే కొందరు రైతులు చేపట్టిన అనధికార ఆక్వా కారణంగా పక్కనున్న పంట పొలాలకు ఊట చేరి బీళ్లుగా మారుతున్నాయి. దీనికి అడ్డుకట్ట వేసి తమ పంట పొలాలను రక్షించాలంటూ వరి రైతులు అభ్యర్థిస్తున్నా సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేకున్నారు. దీంతో వరస నష్టాలను భరించలేని రైతులు విధిలేని పరిస్థితిలో క్రాప్ హాలిడేలను ప్రకటించేస్తున్నారు.

> **అనుమతులు లేకుంటే చర్యలు తప్పవు**
>
> ఆక్వా సాగుకు సంబంధించి రైతులు తప్పనిసరిగా ఆక్వా అథారిటీ అధికారుల అనుమతి తీసుకోవాలి. అప్సడా యాక్ట్ ప్రకారం నెల్లూరు డివిజన్‌లో సాగులో ఉన్న 6,600 ఎకరాలకు సంబంధించి అనుమతులు పొందేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఆక్వా అధికారుల అనుమతి లేకుండా రొయ్యల చెరువులు చేపట్టిన రైతులకు ఇది వరకే నోటీసులు ఇచ్చాం. స్పందించని రైతులపై చట్టపరమైన చర్యలు తప్పవు.
>
> – స్టీఫెన్, మత్స్యశాఖాధికారి, నెల్లూరు డివిజన్

నారుమళ్లకు సాగునీరు విడుదల



సోమశిల ఎస్ఈ వెంకటరమణారెడ్డి

నెల్లూరు (దర్గామిట్ట): ఐఏబీ సమావేశం ఇంకా జరగకపోవడం, జిల్లాలోని రైతాంగం నారుమళ్లు సిద్ధం చేసుకునేందుకు సమయం మించిపోతున్న తరుణంలో కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం సోమశిల నుంచి 2,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని ప్రాజెక్ట్ ఎస్ఈ వెంకటరమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిలలో నీటి లభ్యత పుష్కలంగా ఉన్న దృష్ట్యా నీటిని విడుదల చేస్తున్నామని, రైతులు సాగునీటిని వాడుకుని పంటలను పండించుకోవాలని కోరారు. జిల్లాలో 5.51 లక్షల ఎకరాల ఆయకట్టుకు ఈ సీజన్‌లో నీరు అవసరం ఉందన్నారు. పెన్నార్ డెల్టా కింద 2,47,000 ఎకరాలు, కనుపూరు కాలువ కింద 66 వేల ఎకరాలు, కావలి కాలువ కింద 1,24,000 ఎకరాలు, నార్త్ ఫీడర్ చానల్ కింద 72,000 ఎకరాలు, సౌత్ ఫీడర్ కెనాల్ కింద 42 వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు విడుదల చేయాల్సి ఉందని ఎస్ఈ నాయక్ తెలిపారు. కనిగిరి, కనుపూరు, కావలి కాలువలకు ఈ నెల 30వ తేదీ నుంచి రోజుకు 500 క్యూసెక్కుల చొప్పున 20వ తేదీ వరకు సర్వేపల్లి కాలువకు 20వ తేదీ వరకు 600 క్యూసెక్కులు చొప్పున నీరు విడుదల చేస్తామన్నారు. 5 నుంచి 19వ తేదీ వరకు జీకేఎన్ కాలువకు 500 క్యూసెక్కులు, సౌత్‌ఫీడర్ చానల్‌కు 300 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తామని తెలిపారు. కండలేరు నుంచి కేఆర్ లెఫ్ట్ కెనాల్‌కు 120 క్యూసెక్కులు, మనుబోలు సిస్టం ట్యాంక్ స్లూయిజ్ ద్వారా 200 క్యూసెక్కులు, ఫస్ట్ బ్రాంచ్ కెనాల్‌కు 75 క్యూసెక్కులు, ఎస్ఎస్‌జీ కెనాల్స్‌కు 2ఏ, 2బీ, 3, 4, 5, 5ఏ, 6, 7, 8ఏ తదితర వాటికి 950 క్యూసెక్కులు, చెన్నై తాగునీటి అవసరాలకు 950 క్యూసెక్కులు, తిరుపతి, శ్రీకాళహస్తి, ఏర్పేడుకు 100 క్యూసెక్కుల చొప్పున ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 13వ తేదీ వరకు నీరు విడుదల చేస్తామని వెంకటరమణారెడ్డి తెలిపారు.

నిరుద్యోగుల నైపుణ్యతపై సర్వే చేస్తాం



మాట్లాడుతున్న ఎంపీడీఓ సుబ్బారావు

కొడవలూరు : ప్రతి గ్రామంలో 18–50 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి చదువుకున్న వారి నైపుణ్యతపై త్వరలో సర్వే చేస్తామని ఎంపీడీఓ ఏవీ సుబ్బారావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే సమయంలో ఎవరికి ఏ రంగంలో ఆసక్తి ఉందో పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. తదుపరి వారికి ఏ రంగంలో పేర్లు నమోదు చేసుకున్నారో.. ఆ రంగంలో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఈఓపీఆర్డీ సాయిప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు డి.సురేష్ కుమార్, శ్యాంసుందర్, షబ్బీర్, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

మద్యం షాపు ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆందోళన



మద్యం దుకాణం ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

తోటపల్లిగూడూరు: మండలంలోని నరుకూరు సెంటర్‌లో జనావాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయడం సమంజసం కాదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వేగూరు వెంకయ్య అన్నారు. సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో షాపు పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ నాయకులు, కార్యకర్తలు కొద్దిరోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. అయినా నిర్వాహకులు పట్టించుకోకుండా బుధవారం మద్యం షాపును తెరిచారు. ఈ క్రమంలో సీపీఎం నాయకులు అడ్డగించే ప్రయత్నం చేశారు. అయితే నిర్వాహకులు లెక్క చేయలేదు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ నరుకూరు సెంటర్ నిత్యం వేలాది మంది జనంతో రద్దీగా ఉంటుందన్నారు. మహిళలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. నెల్లూరు రూరల్ ప్రాంతానికి చెందిన కొందరు వ్యాపారాలు ఇక్కడ దుకాణాన్ని ప్రారంభించేందుకు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొడుతూ వచ్చామన్నారు. అయితే షాపును ఇక్కడే కొనసాగించడం దారుణమన్నారు. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు మారుబోయిన రాజా తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎన్‌జే డిస్టిలరీలో సీఐడీ తనిఖీలు



తనిఖీలు చేస్తున్న సీఐడీ బృందం

వెంకటాచలం: విజయవాడ నుంచి వచ్చిన సీఐడీ బృందం మండలంలోని సర్వేపల్లి సమీపంలో ఉన్న ఎస్ఎన్‌జే డిస్టిలరీ (బీరు ఫ్యాక్టరీ)లో బుధవారం తనిఖీలు నిర్వహించింది. రికార్డులను చూసింది. కంపెనీ ప్రతినిధులతో పలు విషయాలపై చర్చించారు. ఈ తనిఖీలు సాయంత్రం వరకు జరిగాయి.

పాఠశాలల్లో భోజనం చేయాలి

మనుబోలు : విద్యార్థులు పాఠశాలల్లోనే మధ్యాహ్న భోజనం చేయాలని ఎంఈఓ రమేష్‌కుమార్ సూచించారు. స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం ఆయన మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొందరు విద్యార్థులు ఇళ్ల వద్ద నుంచి భోజనం తెచ్చుకుంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలా చేయవద్దని కోరారు. అనంతరం పాఠశాలలో వసతులపై ఆరాతీశారు. విద్యార్థుల హాజరు, బోధన తదితర విషయాలను హెచ్‌ఎం వసంతకుమారిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

బాణసంచా దుకాణాల వెలవెల



బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాల్లో ధరలు ఆకాశాన్నంటడంతో ప్రజలు లేక వెలవెలబోతోంది. ఓ పక్క కొనుగోలు ధరలతో పాటు నాయకులు వసూలు చేసిన మామూళ్లతో కలుపుకుని విక్రయాలు జరపడంతో వినియోగదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దుకాణాలకు లైసెన్సు ఫీజుతో కలిపి అన్నిరకాల మామూళ్ల కింద ఒక్కో షాపునకు రూ.45 వేలు వసూలు చేసినట్లు దుకాణ యజమానులు పేర్కొనడం గమనార్హం. అయితే ధరలు ఎక్కువగా ఉండడంతో వినియోగదారులు షాపులకు రాకుండా వెళ్లిపోతున్నారు. ఈ సంవత్సరం వరుణుడు కరుణించినా ధరాభారం అధికంగా ఉండడంతో నష్టాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని నిర్వాహకులు వాపోతున్నారు.

ఊరూరా దీపావళి శోభ



తోటపల్లిగూడూరు : సౌత్‌ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాలలో సంబరాలు చేసుకుంటున్న విద్యార్థులు

తోటపల్లిగూడూరు : పట్టణాలు, గ్రామాల్లో దీపావళి శోభ ముందే మొదలైంది. వినాయక చవతి తర్వాత పిల్లలు, యువత ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే పండగ దీపావళి. ఈ క్రమంలో ప్రధాన కూడళ్లలో బాణసంచా దుకాణాలు వెలిశాయి. మండలంలోని నరుకూరు, సౌలిపేట, మహాలక్ష్మీపురం, తోటపల్లిగూడూరు సెంటర్లలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాల్లో బుధవారం ఉదయం నుంచే అమ్మకాలు ఆరంభమయ్యాయి. ప్రస్తుతం ధరలు బాగా పెరిగినట్లు వినియోగదారులు అంటున్నారు.

సౌత్‌ఆములూరులో..

మండలంలోని సౌత్‌ఆములూరు ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు బుధవారమే ముందస్తు దీపావళి వేడుకలను జరుపుకున్నారు. పాఠశాల హెచ్‌ఎం షేక్.అహ్మద్‌బాషా ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో విద్యార్థులు మతాబులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు.

పాఠశాలల్లో..

పొదలకూరు : పట్టణంలోని విజేత ఇంగ్లిష్ మీడియం స్కూల్లో బుధవారం ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు దీపాలు వెలిగించి టపాసులు కాల్చారు. కరస్పాండెంట్ జి.కామాక్షి మాట్లాడుతూ పిల్లలకు పండగల విశిష్టతను తెలియజేసేందుకు పాఠశాలలో దీపావళిని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు.


➡ పట్టణంలోని నాగార్జున స్కూల్లో ముందస్తు దీపావళిని నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేసి రంగవల్లులను వేశారు. దీపాలు వెలగించి బాణసంచా కాల్చారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

➡ పట్టణంలోని అమరావతి స్కూల్లో ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాలుష్య రహిత టపాకాయలు కాల్చాలని కరస్పాండెంట్ కే.సురేష్ పిల్లలకు వివరించారు. విద్యార్థినులు లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు.

➡ **ముత్తుకూరు :** కృష్ణపట్నంలోని అదానీ వరల్డ్ స్కూల్‌లో బుధవారం ముందస్తు దీపావళి వేడుకలను నిర్వహించారు. ప్రిన్సిపల్ సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులు నరకాసుర వధ నాటకం ప్రదర్శించి, అతిథుల మన్ననలు అందుకున్నారు. అనంతరం నాలుగో తరగతి విద్యార్థి మితిన్ శ్రీనివాస్, ఎనిమిదో తరగతి విద్యార్థిని దేవవర్షిణి కూచిపూడి, భరతనాట్యంతో అలరించారు. అకడమిక్ కో–ఆర్డినేటర్ వరలక్ష్మి, హెడ్ రాబిన్, కో–ఆర్డినేటర్‌లు ఉష, దేవకి, సుమన్ పాల్గొన్నారు.




తోటపల్లిగూడూరు : నరుకూరులో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు



ముత్తుకూరు : భరతనాట్యం చేస్తున్న విద్యార్థి

రావి ఆకుపై దీపావళి శుభాకాంక్షలు



పొదలకూరు : రావి ఆకుపై దీపావళి శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు విశ్రాంత ఉపాధ్యాయుడు పచ్చా పెంచలయ్య ఓ చిత్రాన్ని ఆవిష్కరించారు. మండలంలోని మహ్మదాపురం గ్రామానికి చెందిన ఈయన పండగల సందర్భంగా రావి ఆకులపై చిత్రాలను గీస్తుంటారు.



పొదలకూరు : లక్ష్మీదేవికి పూజలు చేస్తున్న చిన్నారులు



పొదలకూరు : పూజలు చేస్తున్న పిల్లలు



ముత్తుకూరు : అదానీ స్కూల్‌లో..

విత్తన శుద్ధితో తెగుళ్ల నియంత్రణ

• డీఏఓ సత్యవాణి

మనుబోలు : రైతులు నారుమళ్లు వేసే ముందు విత్తన శుద్ధి చేసుకుంటే పైరు దశలో వచ్చే తెగుళ్లను నియంత్రించడంతో పాటు అధిక దిగుబడలు సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి(డీఏఓ) సత్యవాణి అన్నారు. మండలంలోని వెంకన్నపాళెం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సూడోమోనాస్, బావిస్టిన్, కార్బడిజంతో విత్తనాలను శుద్ధి చేసుకున్న తరువాత నారుమళ్లు వేయాలన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులను ఎటువంటి కొరత లేకుండా సరఫరా చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏలు నర్సోజిరావు, శివనాయక్, మండల వ్యవసాయాధికారి షేక్.జహీర్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధి పాటించాలి

పొదలకూరు : రైతులు విధిగా విత్తన శుద్ధి పాటిస్తే తెగుళ్ల నుంచి పంటలను కాపాడేందుకు అవకాశం ఉంటుందని ఏఓ ఎ.వాసు సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని ఆల్తుర్తి, గురవాయపాళెం గ్రామాల్లో రైతులతో మాట్లాడారు. రబీ సీజన్‌లో వరినార్లు పోసుకునే రైతులు కేఎన్ఎం 1638 రకం విత్తనాలను నవంబర్ మొదటి వారంలో, ఆర్ఎన్ఆర్ 15048 రకాన్ని నవంబరు 15వ తేదీ తర్వాత నార్లు పోసుకోవాల్సిందిగా సూచించారు. విత్తన శుద్ధి వల్ల నెలరోజుల్లో రసం పీల్చు పురుగు నుంచి నారుమడులను కాపాడుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం నారుమడులు, విత్తనాల ఎంపికపై అవగాహన కల్పించారు. ఏఈఓ ఏడుకొండలు, వీహెచ్ఏ రత్నమ్మ, దీప పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

ముత్తుకూరు : వరి నారుమడిలో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే 25 నుంచి 30 రోజుల వరకు తెగుళ్ల ప్రమాదం ఉండదని ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని తాళ్లపూడిలో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక పొలాల్లో నారుమడులను పరిశీలించి, మాట్లాడారు. రబీ సీజన్‌కు సరిపోయే వరి వంగడాలను ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు. భూసార పరీక్ష ఫలితాల ప్రకారం ఎరువులను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ జ్యోత్స్నరాణి, వీఏ శ్రీనివాస్, ఏఈఓ దేవరాజ్ పాల్గొన్నారు.

సూచనలు పాటించాలి

కొడవలూరు : రైతులు నారుమడిలో విధిగా కార్బోఫ్యూరాన్ 3జీ గూళికలు వాడాలని ఏఓ లక్ష్మి సూచించారు. మండలంలోని తలమంచి, దామేగుంటల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గూళికలు ఎకరానికి 160 గ్రాముల వంతున వాడాలని చెప్పారు. పంట బీమా గురించి రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ అధికారి శాంతి మాట్లాడుతూ విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. జేవీఓ వెంకట్రావు పశువులకు వ్యాక్సినేషన్ గురించి వివరించారు. ఏఈఓ ఎ.అనూష, వీఏఏలు బి.లిఖిత, ఎస్.ప్రసాద్, సర్పంచ్ వై.భాస్కర్‌రావు పాల్గొన్నారు.

అందరికీ న్యాయం చేస్తాం

• ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెంలో మంగలికట్ట కాలనీ వాసులకు, పందుల పెంపకందారులకు తగిన న్యాయం చేస్తామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి హామీ ఇచ్చారు. మండల కేంద్రంలో ఓ కార్యక్రమానికి బుధవారం రాత్రి హాజరైన ఆమెకు మంగలికట్ట కాలనీ వాసులు వినతి పత్రం అందజేశారు. ఇప్పటికే పందుల పెంపకందారులకు మంజూరు చేసిన ఏడు పట్టాలను కూడా రద్దు చేసి వారికి మరో ప్రాంతంలో నివాసాలు చూపాల్సిందిగా కోరారు. వారికి ప్రత్యేకంగా కాలనీ ఏర్పాటు చేసేందుకు కలెక్టర్‌తో చర్చలు జరుపుతున్నామని, ఎవరూ ఆందోళన పడొద్దంటూ హామీ ఇచ్చారు. అనంతరం పందుల పెంపకందారుల వద్ద కూడా అర్జీని స్వీకరించి వారికి అనువైన స్థలంలో కాలనీని ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక పాఠశాలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. పార్టీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, శివరామకృష్ణారెడ్డి, శేషయ్య, హరికృష్ణ పాల్గొన్నారు.

సన్మానం

విడవలూరు : మండలంలోని దండిగుంట పంచాయతీలో కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు, వీఆర్వోగా ఉన్న సుబ్బయ్య ఇటీవల బదిలీ అయ్యారు. అదేవిధంగా నూతన సెక్రటరీగా సుమంత్ దండిగుంటలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇరువురిని స్థానిక నాయకులు బుధవారం సన్మానించారు.

ఇద్దరు విద్యార్థుల డిబార్

వెంకటాచలం : విక్రమ సింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) పరిధిలోని అనుబంధ కళాశాలల్లో బుధవారం నిర్వహించిన ఐదో సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయినట్లు వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ ఆర్.మధుమతి తెలిపారు. మొత్తం 4,604 మంది విద్యార్థులకు, 4,343 మంది హాజరు కాగా 261 మంది గైర్హాజరయ్యారు. నెల్లూరు నగరంలోని జెనెక్స్ విజన్ డిగ్రీ కళాశాలలో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారని తెలిపారు.